

గంభీరావుపేట మండల కేంద్రంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

# పలుకరిస్తూ.. భరోసానిస్తూ..

- ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు రామన్న ధైర్యం
- సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన
- మూడు మండలాల్లో బాధిత కుటుంబాలకు పరామర్శ
- వివాహ వేడుకలకు హాజరు.. నూతన జంటలకు ఆశీర్వాదం
- ప్రజల నుంచి వినతులు స్వీకరణ.. పరిష్కారానికి హామీ



ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో దళితబంధు లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ఆప్తులను కోల్పోయిన పలు కుటుంబాలను పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసానిచ్చారు. అలాగే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులు, చిన్నారులను ఆపాయ్యంగా పలుకరించారు. ఆయా చోట్ల ప్రజల నుంచి వినతులు స్వీకరించి.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్ ఉదయం 11.30గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చేరుకున్నారు. గురువారం వివాహం చేసుకోనున్న సోషల్ మీడియా కార్యకర్త సాయికృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేటలో రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకటరెడ్డి కొడుకు-కోడలు నరేశ్‌రెడ్డి-చందన దంపతులను ఆశీర్వదించారు. తర్వాత నూతనంగా సహకార సంఘ భవనాన్ని సందర్శించి చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, డైరెక్టర్లను అభినందించారు. హరిదాస్‌నగర్‌లో జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు నూతన ఇంటికెళ్లారు. అనంతరం పదిరలో దళితబంధు పథకం కింద ఏర్పాటు చేసిన 'నయార' పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి ముస్తాబాద్ మండలం చేరుకుని అయ్యప్ప ఆలయంలో జరిగిన మహాపడి పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప మాలధారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ యూత్ నాయకుడు గుణశేఖర్ సోదరి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తర్వాత పోతుగల్‌లో హెల్పర్ జంగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, గంభీరావుపేట మండలం శ్రీగాధలో సీనియర్ నాయకుడు మాణిక్‌రావు, చొక్కారావు కుటుంబ సభ్యులు, మండల కేంద్రంలోని ఎంపీటీసీ దేవేందర్, పార్టీ పట్టణాధ్యక్షుడు వెంకట్‌యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీలు, జడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★HYD-Begumpet, Shyamlal Building Nr. HPS, New Individual Semi-Commercial House Sale, 200 Sq.y., G+4 Floors & Floor-wise also Sale after completion Rent 3L p.m. for total Building. Ph: 9032015898, Owner.
NT-313090

CHANGE OF NAME

★I, SAYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam, R/o. 6-6-363, Saheth Nagar, Karimnagar, TS. Changed My Name as SAYYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam.
NT-324496

★I, NALUVALA KAVITHA, W/o. Chekka Maruthi, R/o. 2-43, Kondagattu, Muthyampet, Mallial, Jagityal, TS. Changed My Name as CHEKKA KAVITHA, W/o. Chekka Maruthi.
NT-324497

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదస్సుకు కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



కార్పొరేషన్, డిసెంబర్ 27: అమెరికాలోని వేగస్ పట్టణంలో ఇంటర్నేషనల్ టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు నిర్వహించే ప్రపంచస్థాయి సదస్సుకు కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావుకు ఆహ్వానం అందింది. స్మార్ట్ సిటీల డైరెక్టర్ లాల్ చందమా సదస్సుకు రావాలని బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సదస్సు జనవరి 23 నుంచి 25వ తేదీ వరకు వేగస్‌లో జరుగనున్నది. సివిల్ మెకానికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన అంతర్జాతీయ కంపెనీలు స్మార్ట్‌సిటీల అభివృద్ధికి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించే విధానంపై అవగాహన కలిగించనున్నారు. కాగా, ఈ సదస్సుకు ఆహ్వానం అందడంపై సునీల్‌రావు సంతోషం వ్యక్తం చేశారు.

## నోడల్ అధికారిగా శ్రీదేవసేన



కరీంనగర్ : ప్రజా పాలన పర్యవేక్షణ కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు శ్రీదేవసేనను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ జాయింట్ కలెక్టర్‌గా, పెద్దపల్లి కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఆమెకు ఉన్నది. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు జరుగనున్న ప్రజా పాలన గ్రామ సభలను ఆమె పర్యవేక్షించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి గ్రామసభలను సమర్థ వంతంగా నిర్వహించేందుకు అధికారులకు మార్గనిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గ, మండల స్థాయిలో స్పెషల్ అధికారులను ఆయా జిల్లాల కలెక్టర్లు నియమించారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వేదికపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, సంజయ్ కల్వకుంట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, విజయరమణారావు, మక్కాన్‌సింగ్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సీపీ అభిషేక్ మహంతి, తదితరులు

# వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు

- అందుకోసమే దరఖాస్తులు స్వీకరిస్తున్నాం
- ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం
- అధికారులు 24గంటలపాటు అందుబాటులో ఉండాలి
- ఎవరి పరిధిలో వారు చొరవ తీసుకోవాలి
- దరఖాస్తుల పరిశీలన తర్వాతే కొత్త రేషన్ కార్డులు
- కరీంనగర్‌లో మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి
- ప్రజా పాలనపై ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష
- హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్‌లు, ఎమ్మెల్యేలు



హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

కరీంనగర్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): వంద రోజుల్లో తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకోసమే ప్రజా పాలన పేరిట గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. అధికారులు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను ఫోన్లలో సంప్రదించవచ్చని సూచించారు. గ్రామ సభల్లో ఒక్క దరఖాస్తుదారు కూడా ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఫారం ఉంటుందని, రేషన్ కార్డు ఉన్న వారు, లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ, బస్తీ సభల్లో వచ్చే దరఖాస్తుల ఆధారంగానే త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ప్రజా పాలన గ్రామ సభల నిర్వహణపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులు, సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 6 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహిస్తున్నామని, సెలవు రోజులు మినహా మిగిలిన రోజుల్లో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు తీసుకుంటామని అన్నారు. అధికారులు ఎవరి పరిధిలో వారు చొరవ చూపాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, ఎక్కువ మంది వచ్చినప్పుడు టోకెన్ సిస్టంలో దరఖాస్తులు స్వీకరించాలని, పెద్ద గ్రామాలు ఉంటే కౌంటర్లు ఎక్కువ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమ పాలన అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలోని పలు ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని, దీనిని పరిశీలించేందుకు ఈ నెల 29న తాము అక్కడికి వెళ్తామని చెప్పారు. రేషన్ బియ్యం కిలోకు ₹39 వెచ్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఉచితంగా అమలు చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని 54 లక్షల కుటుంబాలకు కేంద్రం 5 కిలోలు, రాష్ట్రం ఒక కిలో చొప్పున మరో 35 లక్షల కుటుంబాలకు రాష్ట్రమే ప్రతి మనిషికి 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నదన్నారు. అయితే రేషన్ బియ్యం ఎక్కువగా రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ అవుతున్నదని, ఈ విషయంలో తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించబోతున్నదని స్పష్టం చేశారు. పేదలకు లబ్ధి చెందేలా మంచి పాలనను అందించాలని తమ ప్రభుత్వం భావిస్తున్నదన్నారు. కాగా, ప్రజాపాలన గ్రామ సభల నిర్వహణపై కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు మిగతా జిల్లాల కలెక్టర్లు మంత్రులకు ఈ సందర్భంగా వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా చేశారు. గ్రామసభలు శాంతియుతంగా జరిగేందుకు తీసుకున్న చర్యలను ఆయా జిల్లాల పోలీస్ అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ (జగిత్యాల), డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ (కోరుట్ల), మేడిపల్లి సత్యం (చొప్పదండి), డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూర్), పాడి కౌశిక్ రెడ్డి (హుజూరాబాద్), చింతకుంట విజయరమణారావు (పెద్దపల్లి), మక్కాన్ సింగ్ ఠాకూర్ (రామగుండం) తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సంజయ్ కల్వకుంట్ల, పాడి కౌశిక్‌రెడ్డి

### యువ ఎమ్మెల్యేల ప్రశ్నలు

మొదటి సారి జిల్లా సమీక్షకు విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి బీఆర్ఎస్ యువ ఎమ్మెల్యేలు ప్రశ్నలు సంధించారు. తమ నియోజకవర్గంలో ఇది వరకే మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా అధికారులు అడ్డు చెబుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ తాను కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింద తన నియోజకవర్గంలో ఇచ్చిన ప్రొసీడింగ్‌లను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ ప్రొసీడింగ్‌లు పొందిన చాలా మంది లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకుని బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారని వివరించారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్ స్పందించి, తప్పకుండా పరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

### అందరం కలిసి పనిచేద్దాం



ఆరు గ్యారెంటీల అమలు కోసం మా ప్రభుత్వం సిటిజన్ చార్ట్‌ను రూపొందిస్తున్నది. అందుకోసం వివిధ సంఘాల నాయకులతో చర్చిస్తున్నాం. ఎన్నికల ముందు మేమిచ్చిన అభయ హస్తం హామీల్లో రెండింటినీ ఇప్పటికే అమలు చేశాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఇప్పటి వరకు 4 కోట్ల జీరో టికెట్లు ఇచ్చాం. అంటే 40 నుంచి 50 లక్షల మంది మహిళలు ఇప్పటి వరకు ఉచిత ప్రయాణం చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే ముందు పూర్తి డాటా కలెక్షన్ చేస్తున్నాం. అందులో భాగంగానే ప్రజా పాలన గ్రామ, బస్తీ సభలు నిర్వహిస్తున్నాం. ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తుదారులు చిరునవ్వుతో దరఖాస్తులు చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి. ప్రజలు కోరుకున్న మార్పును చేసి చూపిస్తం. అందుకోసం అందరం కలిసి పనిచేద్దాం. దరఖాస్తుల స్వీకరణ సమయంలో పోలీసులు చొరవ తీసుకుని ఎక్కడ ఇబ్బందులు కలగకుండా చూడాలి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మోడల్ అభివృద్ధి జరగాలి. అందుకోసం అధికారులు సలహాలు, సూచనలు చేయాలి. ఐదేళ్లలో అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటాం. అధికారులు అందుకు సహకరించాలి.

- దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖల మంత్రి

### ఒక్క దరఖాస్తునూ తిరస్కరించ వద్దు



గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో తప్పులు ఉన్నాయనే నెపంతో అధికారులు ఒక్క దరఖాస్తు కూడా తిరస్కరించవద్దు. ప్రతి దరఖాస్తుపైనా ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది. ఈ నెల 7న మా ప్రభుత్వం అధికారం చేపట్టింది. రెండు రోజుల్లోనే మేమిచ్చిన హామీల్లో రెండింటినీ అమలు చేశాం. గ్రామసభల్లో స్వీకరించే దరఖాస్తుల ద్వారా మిగతా హామీలన్నింటినీ అమలు చేస్తాం. దరఖాస్తుదారులకు చిన్న ఇబ్బంది కూడా కలుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజా పాలనలో అధికారులు పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలి. అన్ని జిల్లాలకు కరీంనగర్ ఆదర్శంగా నిలువాలి.

- మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ



ఓటేసేందుకు బారులు తీరిన కార్మికులు



# ఓటెత్తిన కార్మికులు

- సింగరేణిలో ముగిసిన 'గుర్తింపు' ఎన్నికలు
- 95 శాతానికి మించి పోలింగ్
- అర్ధరాత్రి వరకూ కౌంటింగ్ ప్రక్రియ

గోదావరిఖని, డిసెంబర్ 27: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులు ఓటెత్తారు. అభ్యంతరాలు, కోర్టు తీర్పులు, తర్జన భర్జనల మధ్య ప్రశాంత వాతావరణంలో సింగరేణిలో ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించగా, పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 11 డివిజన్ల పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగ్గా, ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఫస్ట్ షిఫ్టులో వచ్చిన వారు ఉదయం, సెకండ్ షిఫ్టులో వారు మధ్యాహ్నం, నైట్ షిఫ్టు డ్యూటీ చేసిన వారు ఉదయమే ఓట్లు వేశారు. సింగరేణి వ్యాప్తంగా 39,805 ఓట్లకు గాను 37,451 ఓట్లు (95 శాతం) నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఓటింగ్ ముగిసిన అనంతరం ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను తరలించారు. రాత్రి 7 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. అన్ని కేంద్రాలకు వచ్చిన పోలింగ్ డబ్బాలను ఏజెంట్లకు చూపించాక సీల్ ఓపెన్ చేశారు. అనంతరం 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టారు. 13 యూనియన్లకు 13 డ్రమ్ములు పెట్టి వారికి వచ్చిన ఓట్లను అందులో వేశారు. అనంతరం కౌంటింగ్ చేశారు. ఈ ప్రక్రియ అంతా ముగిసే సరికి అర్ధరాత్రి దాటింది.

**డివిజన్ల వారీగా పోలైన ఓట్లు**

| ఏరియా | మొత్తం ఓట్లు | పోలైనవి | శాతం |
|---|---|---|---|
| ఆర్జీ-1 | 5834 | 5044 | 93.70 |
| ఆర్జీ-2 | 3556 | 3369 | 94.74 |
| ఆర్జీ-3 | 3884 | 3612 | 93.00 |
| బీహెచ్‌పీ | 5442 | 5123 | 94.13 |
| భూపాలపల్లి | 996 | 959 | 96.30 |
| మందమర్రి | 4835 | 4515 | 93.40 |
| శ్రీరాంపూర్ | 9127 | 8491 | 93.00 |
| కొత్తగూడెం | 2326 | 2207 | 94.88 |
| ఇల్లందు | 614 | 604 | 98.37 |
| మణుగూరు | 2450 | 2378 | 97.05 |
| కార్పొరేట్ | 1191 | 1149 | 96.47 |
| మొత్తం | 39805 | 37451 | 95 |



వడ్డీ రేట్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొండూరు రవీందర్‌రావు, డైరెక్టర్లు

## కేడీసీసీబీలో 'సహకార క్రాంతి'

నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

విద్యానగర్, డిసెంబర్ 27: వినియోగదారులను ఆకర్షించి డిపాజిట్లను పెంచే లక్ష్యంతో కరీంనగర్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంకులో 'సహకార క్రాంతి' పథకాన్ని ప్రారంభించామని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. సాధారణ ఖాతాదారులు, సీనియర్ సిటిజన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచామని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్‌లోని కేడీసీసీబీ కార్యాలయంలో వైస్ చైర్మన్ పీ రమేశ్, సీఈవో ఎన్ సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 నెలలు (546 రోజులు)కు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 7.5 శాతం, సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ అందిస్తామని వివరించారు. ఇక్కడ బ్యాంక్ డైరెక్టర్లు ముప్పాల రాంచందర్‌రావు, వీ మోహన్‌రెడ్డి, సింగిరెడ్డి స్వామి రెడ్డి, కమలాకర్, మోహన్‌రావు, గోపాల్‌రావు, శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, నరేశ్ రెడ్డి, నాబార్డు డీడీఎం మనోహర్ రెడ్డి, టీఎస్ సీఏబీ ప్రత్యేక ఆహ్వానితులు శ్రీనివాస్‌రావు, సీఏ రమేశ్ ఉన్నారు.

## అమ్మమ్మ ఇంటికి వెళ్లొస్తూ బాలిక అదృశ్యం

రాంనగర్, డిసెంబర్ 27: కరీంనగరంలోని విద్యారణ్యపురికి చెందిన బాలిక బుధవారం అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు విద్యారణ్యపురికి చెందిన కనుకుంట్ల స్వప్న నరసింహ దంపతుల కూతురు కనుకుంట్ల వశిష్ట కృష్ణ (12) కరీంనగర్‌లోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. రెండ్రోజుల క్రితం పెద్దపల్లిలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం కరీంనగర్‌కు వచ్చేందుకు వశిష్ట కృష్ణను పెద్దపల్లిలో తాతయ్య బస్సు ఎక్కించాడు. బస్సు నంబర్, బస్సు ఫొటోను బాలిక తండ్రి నరసింహకు పంపించారు. వశిష్ట కృష్ణ వచ్చే బస్సు కోసం తండ్రి నరసింహ కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా వద్ద ఎదురుచూశాడు. బస్సు వచ్చినా దిగకపోవడంతో కండక్టర్‌ను అడగగా బొమ్మకల్ ఫ్లై ఓవర్ వద్ద దిగిందని చెప్పాడు. వెంటనే బస్సు దిగిన స్థలం వద్దకు వెళ్లగా, అక్కడ కనిపించలేదు. తండ్రి నరసింహ ఫిర్యాదు మేరకు రూరల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

## దత్తాత్రేయుడి దర్శనానికి బోటింగ్

- త్వరలోనే అందుబాటులోకి తెస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



గుట్ట పైకి బోటులో వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ

బోయినపల్లి, డిసెంబర్ 27: వరదవెల్లి గుట్టపై వెలిసిన దత్తాత్రేయ స్వామివారిని ప్రజలు 365రోజుల పాటు దర్శించుకొనేందుకు వీలుగా బోటింగ్ సౌకర్యాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో దత్తాత్రేయ స్వామి జయంత్యుత్సవాల ముగింపు వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పొన్నం బుధవారం హాజరయ్యారు.స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా దీవించాలని దత్తాత్రేయ స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి లత, ఎంపీటీసీ ఈడ్గు రాజేశ్వరి, మాజీ జడ్పీటీసీ పుల్లి లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ బీసీ సెల్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కూస రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు భీమ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి జూడో పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 27 : జిల్లా విద్యాశాఖ, పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడురోజుల పాటు కరీంనగర్ రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరుగనున్నాయి. మానేరు తీర సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో 67వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి పీ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలకు పూర్వపు పది జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు 40 మంది కోచ్‌లు, మేనేజర్లు, 20 మంది టెక్నికల్ అధికారులు తరలివచ్చారు. వీరికి భోజనం, వసతి సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జనవరి 3 నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేయనున్నారు.